

బత్తిరెడ్డి కుంట ఆక్రమణ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని బాలుపల్లి గ్రామంలో ఉన్న బత్తిరెడ్డి కుంట ఆక్రమణకు గురైంది. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి ఆ కుంటను ఆక్రమించుకుని చదును చేసి వరి నాట్లు వేశాడు. గ్రామస్తులు ఆక్రమణను తొలగించాలని స్థానిక తహశీల్దార్ రమేష్ బాబుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారులకు న్యాయం జరగలేదని, సంబంధిత విషయమై శనివారం మీడియాకు తెలిపారు. భూ ఆక్రమణను అడుకోవాలని న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆక్రమణకు గురైన కుంట

న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జడ్జి సరస వెంకట నారాయణ భట్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న సుప్రీం కోర్టు జడ్జి

ప్రజాశక్తి- పలమనేరు: చట్టాల ద్వారా ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడుతూ న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకట నారాయణ భట్ తెలిపారు. శనివారం బెంగళూరు రోడ్డులో రూ.15.18 కోట్లతో నూతనంగా నిర్మించిన నాలుగు కోర్టు భవనాల సముదాయాన్ని, నలుగురు జడ్జిల నివాస భవన సముదాయాలను సుప్రీం కోర్టు న్యాయమూర్తి హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు హైకోర్టు జడ్జి, చిత్తూరు అడ్మినిస్ట్రేషన్ జడ్జి జస్టిస్ కృష్ణ మోహన్, హైకోర్టు జస్టిస్ టిసిడి శేఖర్ పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంకు విచ్చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు చీఫ్ జస్టిస్‌లకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్‌పి మణికంఠ చందోలు పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలకగా పురోహితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తి పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం నూతన భవనాలు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ మదనపల్లి వాసిగా జిల్లాతో ఉమ్మడి చిత్తూరులోని పలు న్యాయవాదులతో సత్సంబంధాలు కలిగి ఉన్నానన్నారు. గతంలో వృత్తి రీత్యా మదనపల్లి నుండి చిత్తూరు వెళ్లే సమయంలో పలమనేరు మీదుగా ప్రయాణం చేయవలసి ఉండేదన్నారు. ఆంధ్రప్రదేశ్, కేరళ హైకోర్ట్ లాంటి పలు న్యాయస్థానాల ప్రారంభోత్సవాల కార్యక్రమాలకు సుప్రీంకోర్టు కోర్టు జడ్జి హోదాలో హాజరు కావడం జరిగిందన్నారు. పలమనేరులో మెరుగైన మౌలిక సదుపాయాలతో న్యాయస్థాన భవనం నిర్మించారన్నారు. న్యాయవాదులలో నూతన ఉత్సాహాన్ని పెంపొందించడానికి, ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగించడంలో భాగంగా స్వయంగా కార్యక్రమానికి హాజరు కావడం జరిగిందన్నారు. సమస్యలతో వచ్చే ప్రజలకు న్యాయం అందించి ప్రజలకు న్యాయ వ్యవస్థ పై నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ఉందన్నారు. చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావ్, తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి గురునాథ్, చిత్తూరు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల, డిఎల్ఎస్ఎ సెక్రటరీ భారతి, పలమనేరు సివిల్ జడ్జి ఆది నారాయణ, సివిల్ జడ్జి లిఖిత, స్పెషల్ మెజిస్ట్రేట్ రాధమ్మ, పలమనేరు ఆర్‌డిఓ భవానీ, ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకనాథ రెడ్డి, పలమనేరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీపతి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



నూతన కోర్టు భవనాలను ప్రారంభిస్తూ..

ప్లాస్టిక్ నిషేధం అమలయ్యేనా..?

సాగని తనిఖీలు.. అమలు కాని కార్యక్రమాలు..

ఎటు చూసినా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే.. ప్లాస్టిక్ వాడకంతో పెనుముప్పు పొంచి ఉందని తెలిసినా .. మానవాళితోపాటు సహజ జీవకోటికి ప్రమాదమని గ్రహించినా ఆగని ప్లాస్టిక్ వినియోగం. చిన్నపాటి దుకాణాల నుంచి ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వినియోగంపై ఆసక్తి చూపుతున్నారే తప్ప వీటితో ప్రమాదమని గ్రహించి నిషేధించే మార్గాలను మాత్రం చూపడం లేదు. దీనికి తోడు అధికారుల తనిఖీలు అంతంతమాత్రంగా ఉండడంతో ప్లాస్టిక్ వినియోగం మరింత ఉగ్రరూపం దాల్చుతోంది.



ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండలంలోని అన్ని గ్రామాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిషేధించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పిన మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేకుండా పోయింది. ఇంతకుముందు అడపా దడపా తనిఖీలు చేసి జరిమానాలు విధించినా గత కొన్నేళ్లుగా ఆ తనిఖీలు కూడా లేకపోవడంతో మండలంలో ప్లాస్టిక్ విక్రయాలతో పాటు వినియోగం కూడా బాగా పెరిగింది. మండల వ్యాప్తంగా చూస్తే గతంతో పోల్చుకుంటే క్యారీ బ్యాగుల విక్రయాలు కొంతమేర తగ్గినట్టు కనిపించినా.. మళ్లీ అన్ని ప్రాంతాల్లో ప్లాస్టిక్ సంచులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కూరగాయల దుకాణాల దగ్గర నుంచి తినుబండారాలు.. మెస్సులు, హోటల్స్ ఇలా అన్ని ప్రాంతాల్లోనూ ప్లాస్టిక్ సంచులు విస్తృతంగా కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లు విక్రయించే దుకాణదారులతో పాటు వాటిని కొనుగోలు చేసే వినియోగదారులకు కూడా జరిమానా విధిస్తామని అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరికలు చేయడమే కానీ పట్టించుకోవడం లేదు. ప్లాస్టిక్ బ్యాగులుంటే తప్ప వ్యాపారాలు సాగని పరిస్థితి ఉండడంతో వ్యాపార అవసరాల దృష్ట్యా ఇంకా విక్రయాలు సాగిస్తూనే ఉన్నారు . ప్రధాన కూడళ్లలో ఏ ప్రాంతంలోని దుకాణాల్లో చూసిన ఇవి కనిపిస్తూనే ఉన్నాయి.



మురుగు కాలువల్లో పూడిపోతున్న వ్యర్థాలు..

గత ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వం మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహార్ పేరిట ప్రతి సచివాలయంలోనూ రీసైకిల్ రెడ్యూస్ రియూజ్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ప్లాస్టిక్ వస్తువులు తదితరాలు ఇళ్ల నుంచి సేకరించడంతో పాటు ఇచ్చిన వాళ్ళ పేర్లు ఇంటి నెంబర్లు ఇతర వివరాలను నమోదు చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలో కొన్నిచోట్ల ఈ కార్యక్రమం సజావుగా సాగిన మరికొన్నిచోట్ల సాగలేదు. ప్లాస్టిక్ వినియోగం అధికమవుతుండడంతో ఏ మురుగుకాలువలో చూసిన ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.

మేయర్ డబుల్ మర్డర్ కేసులో

ప్రధాన నిందితుడికి బెయిల్

9ఏళ్ల తరువాత చింటూకి బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

2014 నవంబర్ 17వ తేదీ చిత్తూరు నగరంలో చోటు చేసుకున్న మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్ డబుల్ మర్డర్ కేసు అప్పట్లో రాష్ట్రంలో సంచలనం రేపింది. నగర పాలక సంస్థ కార్యాలయంలోనే మేయర్, ఆమె భర్తపై మేయర్ భర్త కఠారి మోహన్ మేనల్లుడు చింటూ (చంద్రశేఖర్) ఈ హత్యలకు కారణంగా పోలీసులు ఏ వన్ ముద్దాయిగా, మరో 11 మందిపై కేసు నమోదు చేశారు. మేయర్ హత్య తరువాత అజ్ఞాతంలోకి వెళ్ళిన చింటూ నాటకీయ పరిణామాల మధ్య కొద్ది రోజుల తరువాత తనంతట తానుగా చిత్తూరు జిల్లా కోర్టులో లొంగిపోయారు. ఈ కేసులోని ముద్దాయిలకు కోర్టు బెయిల్ మంజూరు చేసినా 2014 నుండీ డబుల్ మర్డర్ కేసులో ముద్దాయిగా ఉన్న చింటూ కడప, చిత్తూరు జైల్లో ఉంచారు. చింటూ మాజీ ఎంఎల్ఏ సికే బాబుపై హత్యయత్నం కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్నారు. ఇటీవల సికె బాబుపై బాంబ్లాస్ట్ కేసులో హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం చిత్తూరులో జైల్లో ఉన్న చింటూకు శుక్రవారం హైకోర్టు డబుల్ మర్డర్ కేసులో బెయిల్ మంజూరు చేసింది. ష్యూరిటీల విషయంలో స్పష్టత లేకపోవడంతో చిత్తూరు జైలు నుండీ చింటూ విడుదల కాలేదు. చింటూ తరుపు న్యాయవాది సోమవారం ష్యూరిటీలను సోమవారం నాటికి కోర్టు ముందు ప్రవేశపెట్టి సోమవారం చిత్తూరు జైలు నుండీ చింటూను హెకోర్టు ఆదేశాల మేరకు బెయిల్‌పై విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.



ప్రధాన నిందితుడు చింటూ (చంద్రశేఖర్) (ఫైల్‌ఫొటో)

సదస్సులతోనే సరిపెడతారా..?

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజాసమస్యల పరిష్కావేదికలకు అందుతున్న అర్జీల్లో అత్యధికశాతం అంటే దాదాపు 70 శాతం రెవిన్యూ సమస్యలే.. దశాబ్దాల తరబడీ పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలు సమస్యలుగానే మిగిలిపోతున్నాయి. స్పందన, ప్రజాసమస్యల పరిష్కారవేదిక పేర్లు ఏవైనా భూ సమస్యలపైనే ప్రజలు క్యూవ్‌లో నిలబడి అధికారులకు అర్జీలు సమర్పిస్తున్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామంటూ కూటమి ప్రభుత్వం డిసెంబర్ 8వ తేదీ నుండీ జనవరి 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. వేలసంఖ్యలో అర్జీలొచ్చాయి. రెవెన్యూ సదస్సులు ముగిసి నెలరోజు అవుతున్నా అతిగతి లేదు. సమస్యల పరిష్కారం అంతంతమాత్రంగా ఉంటోంది. చిత్తూరు 642, జీడీ నెల్లూరు 1,916, పూతలపట్టు 1,329, నగరి 889 రెవెన్యూ సదస్సులో అందిన అర్జీలు ఈ నాలుగు నియోజవర్గాలోనే మొత్తంగా 4,676 రాగా 510 పరిష్కరించింది అది కూడా చిన్న పాటి రెవెన్యూ సమస్యలే... పైన పేర్కొన నాలుగు నియోజవర్గాల్లో 17 మండలాల్లో రెవెన్యూ సదస్సులో ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ సమస్యలను పరిష్కరించడంతో రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీకీ జవాబుదారిగా వ్యవహరిస్తాం పరిష్కరిస్తామంటూ భరోసా ఇచ్చినా రెవెన్యూ అధికారుల్లో ఆ స్థాయిలో కదలిక లేదు. స్థానిక అధికార పార్టీ నేతల నుంచి ఒత్తిళ్ళు వస్తున్నట్లు సమాచారం. రాజకీయ జోక్యంతో రెవెన్యూ అధికారులు ముందుకు కదలలేకపోతున్నట్లు తెలుస్తోంది. చిత్తశుద్ధితో పనిచేయాలని భావిస్తున్న రెవెన్యూ అధికారులు రాజకీయ ఒత్తిళ్ళు ఎదుర్కొవాల్సి వస్తోంది. మరోవైపు చేతివాటం చూపే రెవెన్యూ అధికారులు సమస్యల పరిష్కారం విషయంలో కాలయాపన చేస్తున్నారు. అన్ని భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులుంటూ అర్జీలు స్వీకరించినా అడంగల్ తేడాలు, ఒకరి భూమి మరోకరి పేరిట మారడం ఇలాంటి సమస్యలపై క్లీయరెన్స్ రావాలంటున్నారు. రెవెన్యూ శాఖలో పేరుకుపోయిన బాధ్యతా రహితానికి నిదర్శనం. కొందరు రెవెన్యూ అధికారులు తప్పుడు నివేదికలతో సమస్యలు పరిష్కారం అయిన్నట్లు చూపేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అర్జీదారుల నుంచి సంతకాలు సేకరిస్తూ సమస్య పరిష్కరించిన్నట్లు చూపే ప్రయత్నం చేస్తున్నారు.



రెవెన్యూ సదస్సులో సమస్యల పరిష్కారం కాలేదంటూ కలెక్టరేట్‌కు వచ్చిన యానాదులు

ప్రజాదృష్టి

రెవెన్యూ సమస్యలకు చెక్‌పెట్టేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులతో సమస్యలు తీరుతాయని భావించిన జిల్లాలోని అనేక మంది రైతులు పెద్ద సంఖ్యలో రెవెన్యూ సదస్సులో గంటల తరబడీ నిలబడి అర్జీలు సమర్పించారు. తమ సమస్య తీరుతుందని ఆశించారు. నెలరోజులు గడస్తున్నా అతిగతి లేకపోవడంతో ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వ్యవప్రయాసలకోర్చి జిల్లా అధికారులను ఆశ్రయిస్తున్నారు. జిల్లా అధికార యంత్రాగం, రెవెన్యూ ఉన్నతాధికారులు రెవెన్యూ సదస్సుల అర్జీలపై దృష్టిసారించి సమస్యలు పరిష్కరించాలని అర్జీదార్లు కోరుతున్నారు.

సోమల మండలం ముచ్చుకాల్వ యానాది కాలనీకి చెందిన 20 కుటుంబాలకు చెందిన యానాదులు సోమల మండలం పెటూరు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ల 540 - 607, పెద్దపంజాణి మండలం, పెద్దకాంపల్లి పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్లు 211 - 211- 2ఏ, 211-2బిలో సుమారు 50 ఎకరాల భూమి సుమారు 20 కుటుంబాల యానాదులకు 1996 సంవత్సరంలో డీకేటీ పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసింది అప్పటి నుంచి సాగు చేసుకుంటున్నారు. అటవీ హక్కుల చట్టం 2005 ప్రకారం ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని మార్చి 2022వ సంవత్సరంలో రెవెన్యూ, అటవీ, గిరిజన శాఖల అధికారులు కలసి గ్రామసభ నిర్వహించి తీర్మానం చేసి ఆ రిపోర్టును జిల్లా అటవీ శాఖ అధికారికి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారికి పంపడం జరిగింది. ఆ తర్వాత జాయింట్ సర్వే చేయాలని గతంలో చాలాసార్లు స్పందన కార్యక్రమంలో అర్జీలు ఇచ్చారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తమ సమస్యలపై యానాదులు అర్జీలు సమర్పించారు. ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో గత సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి యానాది మహిళలు భూ సమస్యలు పరిష్కారించాలంటూ మళ్లీ అర్జీలు అందించారు.

విద్యార్థులకు శిక్షణా తరగతులు




శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూఓ నాగేశ్వరరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు, జిడి నెల్లూరు, ఎస్‌డబ్ల్యూఓల పరిధిలోని వసతి గృహ విద్యార్థులకు, లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో విషయ నిపుణులతో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు, గుడిపాల, ఐరాల, జిడి నెల్లూరు, పూతలపట్టు, పెనుమూరు మండలా నుంచి విద్యార్థులు హాజరయ్యారు. గణితం, సైన్సు, ఇంగ్లీష్, సబ్జెక్టుల్లో నిష్ణాతులైన మురళీ, శంషీర్ ఖాన్, అరుణ శివప్రసాద్, జయకుమార్ శిక్షణ ఇచ్చారు. పబ్లిక్ పరీక్షలలో అధిక మార్కులు పొందటానికి సూచనలు తెలియజేశారు. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ ఇప్పటికే సరఫరా చేశామని ఏఎస్‌డబ్ల్యూఓ నాగేశ్వరరావు, షకీలా తెలిపారు. హెచ్‌డబ్ల్యూఓలు నవీన్, సురేష్, రమేష్, ఏకాంబరం, త్రివేణి, ఈశ్వరమ్మ, సదా శివమ్మ పాల్గొన్నారు. పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులకు మెలకువలు తెలియజేశారు.

'అమ్మ ఒడి'కి చేరిన అనాథ వృద్ధుడు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అనాథ వృద్ధుడిని అమ్మ ఒడి స్వచ్ఛంద సంస్థకు చేర్చినట్టు తగువారిపల్లి ఉపసర్పంచ్ లోకనాథం నాయుడు తెలిపారు. శనివారం మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీ గాజులపల్లి ఫ్లైఓవర్ వద్ద అనాథ వృద్ధుడు గత కొంతకాలంగా ఉండడంతో అతని గురించి అమ్మ ఒడి నిర్వహకులకు సమాచారం అందించారు. శనివారం అమ్మఒడి నిర్వహకులు పద్మనాభ నాయుడు వారి సిబ్బందితో అక్కడి చేరుకుని అతన్ని అమ్మఒడి కేంద్రానికి తరలించినట్టు ఆయన తెలిపారు. మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, హెడ్ కానిస్టేబుల్ బాబు, షబ్బీర్ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి- యాదమరి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శనివారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ జాతీయ నులిపురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులలో రక్తహీనతను అరికట్టేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 10న అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో కూడా చిన్నారులకు ఈ నులిపురుగుల నివారణకై డీ వార్మింగ్ మాత్రలను మింగించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి మాత్రలు ఆయా పాఠశాలలకు అందించడం జరిగిందని ప్రతి ఒక్కరూ ఈ మాత్రలను వేసుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిపై ఉందన్నారు. అలాగే హ్యాండ్ వాషింగ్‌పై కూడా పిల్లలకు అవగాహన కల్పించి మధ్యాహ్నం భోజనం అనంతరం వారికి డీవార్మింగ్ మాత్రలను వేయించాలని సూచించారు. హెల్త్ సూపర్వైజర్లు లక్ష్మీపతి సెల్వరాణి, ఎంఎల్ హెచ్‌పిలు మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



యాదమరిలో..

బైరెడ్డిపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ ఎంఈఓ, డాక్టర్ విజయచంద్ర డాక్టర్ అరుణకుమార్ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిహెచ్ఓ అనూరాధ, హెచ్ఈ కాంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పి సాయి దివ్య పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో శనివారం నులిపురుగుల నివారణ సమావేశం నిర్వహించారు. రొంపిచర్లలోని పాఠశాలలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఎంఈఓలు డి.శ్రీనివాసులు, ఎన్.ఇందిర, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వినయ్, డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లిలో..

సాధించాలనే తపనుంటే విజయం మీ సొంతం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక విజయం జూనియర్ కళాశాల 16వ వార్షికోత్సవం నాగయ్య కళాక్షేత్రం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శరత్ చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో పాటు సాధించాలనే తపన వున్నా వారికి విజయం సొంతం అవుతుందని అన్నారు. అలాంటి అద్భుతమైన అవకాశాన్ని విజయం విద్యాసంస్థలు కల్పించారని, దానిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థి అభ్యున్నతికి విద్యతో పాటు అన్ని రకాల నైపుణ్యాలను అలవర్చు కొన్నవారు ఉన్నత స్థానాలకు చేరుతారని అన్నారు. విజయం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎం.తేజోమూర్తి, విజయం విద్యాసంస్థలు అత్యున్నత విలువలతో కూడిన విద్యను అందించడంలో మొదటి స్థానంలో ఉన్నాయని వాటిని అందిపుచ్చుకుని విద్యార్థి తమ లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శైలజమూర్తి వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతి ప్రదానం చేసారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జీవరత్నం నాయుడు కళాశాల వార్షిక నివేదికను, సాధించిన విజయాలను వివరించారు.



ఉత్తమ ప్రతిభను కనబరచిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రముఖులు

రైళ్ల రాకపోకలు పునః ప్రారంభం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలో రైళ్ల రాకపోకలు ఆదివారం నుండి పునఃప్రారంభం కానుంది. అమృత్ భారత్‌లో భాగంగా దేశంలోని పలు రైల్వే స్టేషన్లను అభివృద్ధి పరచడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గత 19 రోజులుగా కుప్పం పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఈ కారణంగా రెండవ ప్లాట్‌ఫామ్‌లో ఆగవలసిన బెంగళూరు వైపు వెళ్లే రైళ్లు నిలుపుదల చేయడానికి తాత్కాలికంగా తొలగిస్తూ రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అలాగే ప్రజల సౌకర్యార్థం కుప్పంలో ఆగవలసిన బెంగళూరు వైపు వెళ్లే రైళ్లు మల్లానూరు రైల్వేస్టేషన్లో నిలుపుదల చేయడానికి రైల్వే అధికారులు అంగీకరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కుప్పం రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి కావడంతో తిరిగి బెంగళూరు వైపు వెళ్లే రైళ్లు కుప్పంలో నిలుపుదల చేయడానికి రైల్వే అధికారులు అంగీకరించినట్టు తెలిసింది. దీంతో ఆదివారం ఉదయం 6.40 గంటలకు పుష్పుల్ రైలు ప్రారంభం కానున్నట్టు తెలిపారు. గత 19 రోజులకు ముందు కుప్పంలో ఆగుతున్న ప్రతి రైలు ఆదివారం నుండి తిరిగి నిలుపుదల చేస్తున్నట్టు తెలిసింది. దీంతో ప్రతినిత్యం కుప్పం నుండి బెంగళూరుకు ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు పడవలసిన అవసరం లేదని రైల్వే అధికారులు తెలిపారు.



హైకోర్టు ఉత్తర్వుల మేరకు

పోలీస్ స్టేషన్‌లో సంతకం చేసిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ్ సంతకం చేశారు. కొలమాసనపల్లి పంచాయతీ మాదిగ బండ క్వారీని ఆక్రమించుకున్నారని, అందులోని వాహనాలను దౌర్జన్యంగా తరలించారని క్వారీ యజమాని జనార్థన్ నాయుడు హైకోర్టులో పెట్టిన కేసుల విషయమై పోలీసుస్టేషన్‌కు హాజరై సిఐ నరసింహారాజు సమక్షంలో సంతకాలు పెట్టాల్సిందిగా హైకోర్టు ఉత్తర్వుల మేరకు శనివారం సంతకాలు చేశారు. ఆయన వెంట వైసిపి రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి ఉన్నారు.



రోబోటెక్‌లో ప్రతిభ చాటిన
'బృందావన్' విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న శైలజ కుమారి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చెన్నైలోని విట్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఆరవ జాతీయస్థాయి రొబోటిక్ పోటీలకు చిత్తూరులోని బృందావన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుంచి 68మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది. వారిలో 31 మంది విద్యార్థులు బహుమతులు సాధించారు. ఈ సమావేశానికి డాక్టర్ సి.సైలేంద్రబాబు (డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసి అభినందించారు. ప్రతి రోబోట్‌కు 25 పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరచి బహుమతులను పొందడం ఎంతో గర్వకారణమంటూ పాఠశాల వ్యవస్థాపకులు శైలజ కుమారి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

'మద్యం షాపులు బినామీలు కాజేస్తున్నారు'




సమావేశంలో మాట్లాడుతున్న ఈడిగ సంఘం నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈడిగ కులస్తులకు ప్రభుత్వం 10 శాతం మద్యం షాపులు కేటాయిస్తుండటంతో కొందరు అగ్రకులస్తులు పేదలైన గీత కార్మికులను అడ్డం పెట్టుకొని మద్యం దుకాణాలను దక్కించుకొనే ప్రయత్నం చేస్తున్నట్లు ఈడిగ కులసంఘం నేతలు ఆరోపించారు. జిల్లా కలెక్టర్ బినామి మద్యం టెండర్ దరఖాస్తులను రద్దు చేసి అసలైన గీత కార్మికులకు మద్యం దుకాణాలు అందేలా చర్యలు ఈడిగ సంఘం నాయకులు క్రిష్ణమూర్తి గౌడ్ కోరారు. పెద్దపంజాణి మండలంలో బోగస్ దరఖాస్తు చేశారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. శనివారం నిర్వహించిన ఈడిగ సంఘం సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నాగరాజ, నాయకులు తుమలగోపి, మహేంద్రనాథ్, నీరజాక్షులు, త్యాగరాజ గౌడ్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పెద్దపంజాణి: తాజా పోషక ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని మండల వైద్యాధికారి టి.మురళి అన్నారు. శనివారం నిడిగుంట గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోషకాహార లోపం, రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత, ఎన్‌డిడి ప్రాముఖ్యత, క్యాన్సర్లు, చర్మ వ్యాధులు, కుష్టువ్యాధి మొదలగు వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముందస్తుగా అనుమానిత వ్యాధులపట్ల అవగాహన కల్పించారు. అలాగే శరీరంపై నొప్పిలేని మచ్చలు ఎవరికైనా ఉన్నట్టయితే వెంటనే సమీప ఏఎన్ఎంతో సంప్రదించాలని కోరారు. వ్యాధిని సరైన టైంలో గుర్తించినట్లయితే వైద్యం అందించడం తద్వారా వ్యాధి బాగు చేసుకొనేందుకు సులభతరమవుతుందని ప్రజలకు సూచించారు.

అదనపు ఈవో ఆకస్మిక తనిఖీ



ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి శనివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా లడ్డూ కౌంటర్లు, అగర్‌బత్తీల స్టాల్స్‌ను సందర్శించి విక్రయాలను పరిశీలించారు. అనం తరం బూందీ పోటును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్ర మంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటి ఏర్పాట్లపై సమీక్ష



ప్రజాశక్తి -తిరుమల: తిరుమలలో ఈ నెల 12వ తేది నిర్వహించనున్న శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటి ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి శనివారం తిరుమల గోకులం సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలలో జరిగే అతి ముఖ్యమైన తీర్థ ఉత్సవాలలో ఒకటైన రామకృష్ణతీర్థ ముక్కోటికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. యాత్రికుల కోసం రేడియో బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా ప్రకటనలు, డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. టీటీడీ భద్రతాసిబ్బంది, పోలీసుల సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. అనంతరం, అన్నప్రసాదం, తాగునీరు, వైద్యం సదుపాయాలు, అటవీ శాఖల ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. అధిక బరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న యాత్రికులను, వృద్ధులను, పది ఏళ్లలోపు చిన్నారులను అనుమతించబోమని తెలిపారు. గోగర్భం డ్యామ్ పాయింట్ నుండి పాపవినాశనం వరకు యాత్రికులను తరలించేందుకు ఆర్టీసీ పెద్ద సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేస్తోంది. ఫిబ్రవరి 12వ తేదీ ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే యాత్రికులను ఈ తీర్థానికి అనుమతిస్తారు. ఈ సమావేశంలో ఈఈ సుబ్రహ్మణ్యం, విజిఓ సురేంద్ర, డీఎఫ్ఓ శ్రీనివాసులు, తిరుమల పోలీసు ఉన్నతాధికారులు, ఇతరులు పాల్గొన్నారు.

బియ్యం ఇస్తే.. కందిపప్పు, చక్కెర స్వాహా!

- బ్లాక్ మార్కెట్‌కు తరలింపు
- డీలర్లు కార్డుదారులకు ఇవ్వని వైనం
- పట్టించుకోని పౌర సరఫరాల శాఖ



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: దారిద్ర్య రేఖకు దిగువన వున్న పేదలకు ప్రతి నెలా బియ్యం, కందిపప్పు, చక్కెర రేషన్ సరుకులు చౌక దుకాణాల ద్వారా డీలర్లు పంపిణీ చేయాల్సి వుంది. అయితే రేషన్ డీలర్లు మొదటి రోజు బియ్యం, చక్కెర, కందిపప్పు కొందరికి ఇచ్చి రెండవ రోజు చక్కర, కందిపప్పు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. పౌర సరఫరాల శాఖ కళ్లకు గంతలు కట్టుకొని ఉండడంవల్ల డీలర్లు ఇష్టారాజ్యంగా బ్లాక్ మార్కెట్‌కు నిత్యావసర వస్తువులు తరలించి కార్డుదారులకు రిక్త హస్తం చూపిస్తున్నారు. తిరుపతి నగరంలో పలు చోట్ల రేషన్ డీలర్లు కందిపప్పు, చక్కెర ఇవ్వకుండా విక్రయించుకోవడం అధికమైంది. కార్డుదారులు నిలదీస్తే స్టాక్ అయిపోయిందని సమాధానం చెబుతున్నారు. కొన్ని రేషన్ షాప్‌లు అయితే కందిపప్పు, చక్కెర ఇవ్వకుండా కేవలం బియ్యం ఇచ్చి కార్డుదారులను వెనక్కి పంపుతున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోంది. వైసీపీ ప్రభుత్వంలో అడ్డు అదుపు లేకుండా రేషన్ డీలర్లు కూటమి ప్రభుత్వం వచ్చినా ఇలాగే వ్యవహరించడం వల్ల కూటమి ప్రభుత్వంపై ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తిరుపతిలో పలు గొడౌన్‌లు, రేషన్ షాప్‌లను సందర్శించి అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. అయినా వారిలో ఏ మాత్రం మార్పు రాకపోవడం గమనార్హం.

తిరుపతి జిల్లాలో ఇటీవల ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీని తూనికలు, కొలతల శాఖ ఇన్ స్పెక్టర్ మల్లేశ్వర్ వాహనంలో తూకాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి 15 కిలోలకు 500 గ్రాములు తక్కువ ఉండటాన్ని గుర్తించారు. ఆపరేటర్లపై కేసు నమోదు చేసి రూ.2 వేల జరిమానా విధించారు. జిల్లా కేంద్రంలో వేయింగ్ మిషన్లు యథేచ్ఛగా డబ్బాలు పెట్టి.. బియ్యం పంపిణీ చేస్తున్నారు. తద్వారా ఒక్కో కార్డుదారుడి నుంచి కిలో, రెండు కిలోలు చొప్పున తస్కరిస్తున్నారు. లబ్ధిదారులు ప్రశ్నించలేక పోతుండగా అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వం పాలనలో ప్రజాపంపిణీ వ్యవస్థ గాడి తప్పింది.. అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారింది. అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టింది.. బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ పారదర్శకత పెంచాలని సీఎం, డిప్యూటీ సీఎం పదేపదే ఆదేశిస్తున్నా క్షేత్ర స్థాయిలో మార్పు రావడం లేదు. పౌరసరఫరాల, రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంతో పేద, నిరు పేదలు దోపిడీకి గురవుతున్నారు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు తూకాల్లో మోసాలకు పాల్పడుతూ పెద్ద మొత్తంలో బియ్యాన్ని నొక్కేస్తున్నారు. కందిపప్పు స్టాక్ లేదంటూనే బయోమెట్రిక్ వేయించుకుని పక్కదారి పట్టిస్తున్నారు.

ప్రజా పంపిణీ బియ్యం గోదాముల నుంచి మండల నిల్వ కేంద్రాలకు.. అక్కడి నుంచి చౌక దుకాణాల డీలర్లకు సరఫరా చేస్తారు. ప్రతినెలా ఎనిమిది వేల టన్నుల బియ్యం కార్డుదారులకు అందిస్తారు. ఇంటికే రేషన్ బియ్యం పేరుతో ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ నామమాత్రంగానే మిగిలింది. 60 శాతం పంపిణీ చౌకదుకాణాల ద్వారానే కొనసాగుతోంది. కొందరు డీలర్లు డబ్బాలో పోసి.. ఆ డబ్బా వేయింగ్ మిషన్‌పై పెట్టి లబ్ధిదారులకు అందిస్తున్నారు. డబ్బా అర కిలో బరువు ఉంటుంది. 20 కిలోల పంపిణీకి రెండుసార్లు డబ్బా ద్వారా అందిస్తున్నారు. జిల్లా కేంద్రం లోనే ఇలా ఉంటే.. ఇక మండలాలు, గ్రామాల్లో రెండు మూడు కిలోల వరకు ఉంటోంది. కందిపప్పు చాలాచోట్ల లబ్ధిదారులు కళ్లచూడని దుస్థితి.

వారు వీరు కుమ్మక్కుతో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కుమ్మక్కై బియ్యం దోపిడీకి పాల్పడుతున్నారు. చాలా ప్రాంతాల్లో ఎండీయూ వాహనాలను నడప కుండా చౌక దుకాణం ఎదుటే పంపిణీ చేస్తూ దోచేస్తున్నారు. దుకాణంలో నిల్వ చేసి రాత్రివేళ పక్కదారి పట్టిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు దుకాణం ఎదుటే తిష్టవేసి లబ్ధిదారుల నుంచి కిలో రూ.15-18 చొప్పున కొనుగోలు చేసి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

జిల్లా అంతటికీ ఒక్కడే..

సీఎం ప్రాతినిధ్యం వహించే చోట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తప్ప 31 మండలాల్లో ఒక్క సీఎస్‌ఓటీ లేరు. కనీసం డీఎస్‌వో కార్యాలయంలో అటెండరు లేడంటే.. పాలనా పరిస్థితి ఎలా వుందో అర్థమవుతోంది. సీఎస్‌ఓటీలు, అటెండరును నియమించాలంటూ పలుమార్లు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆ శాఖ అధికారి వాపోతున్నారు. తిరుపతి ఏఎస్ఓ కార్యాలయంలో డిటి తప్ప అటెండర్ లేని పరిస్థితి నెలకొంది. సిబ్బంది కొరతతో సతమతమవుతున్నారు.

ప్రతినెలా నిత్యావసరాల సరఫరా (టన్నుల్లో)

బియ్యం -8,326
కందిపప్పు -389
చక్కెర - 285
బియ్యం కార్డుదారులు - 5.26 లక్షలు
ఎండీయూ వాహనాలు- 269
చౌక దుకాణాలు - 1,457

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యార్థులకు భోజన ప్లేట్లు, విద్యా సామగ్రి అందించినట్టు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్ అన్నారు. మండలంలోని వెలుతురుచేను పంచాయతీ సిజెఎఫ్ఎస్ కాలనీ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సర్పంచ్ సుబ్రమణ్యం నోట్ బుక్స్, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సోమశేఖర్ భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. ఎస్ఎంసి ఛైర్‌పర్సన్ దేవయాని, అంగన్వాడీ కార్యకర్త శాంతి పాల్గొన్నారు.

పిఆర్‌టియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- యాదమరి: మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 9.30గంటలకు పిఆర్‌టియు ఏపి ఆవిర్భావదినోత్సం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల శివప్రసాద్, మోహన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సురేష్ రెడ్డి, ఆనందపిళ్లై కోరారు.

నేడు ఐసిఎంఎఐ ఆధ్వర్యంలో ఆస్పైర్ - 2025

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): నేడు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా కామర్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన నిపుణుల సలహాలతో నిర్వహించే ఆస్పైర్ - 2025 మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తిరుపతి చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ సీఎంఏ పార్థసారథి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా ఐసిఎంఎఐ అధ్యక్షులు సీఎంఏ బిభుటి భూషణ్ నాయక్, ఉపాధ్యక్షులు టిసిఏ సీఎంఏ శ్రీనివాస ప్రసాద్, సీసీఎం సీఎంఏ వినయ్ రంజన్, ఎస్ఐఆర్‌సి ఛైర్మన్ సిఎంఎ విశ్వనాథ బట్ హాజరై కామర్స్ విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో ఉపయుక్తమైన సూచనలను ఇవ్వనున్నారన్నారు. ఉదయం 9 గంటల నుండి 1 గంట వరకు ఈఆస్పైర్- 2025 కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇప్పటికే వెయ్యి మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి రావడానికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్నారని, కార్యక్రమానికి రావాలనుకున్న విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని, అందుకోసం 9032517501 నెంబరును సంప్రదించాలన్నారు.

ప్రాథమిక దశలో కేన్సర్ నివారణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: కేన్సర్ వేగంగా విస్తరిస్తున్న నేటి పరిస్థితుల్లో వ్యాధి పట్ల అవగాహన, నివారణ ముఖ్యమని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కేన్సర్ కేర్ అండ్ రీసెర్చ్ టాటా ఫౌండేషన్ అంకాలజీ డాక్టర్ పి మస్తాన్ సాహెబ్ పేర్కొన్నారు. శనివారం ఉదయం యల్ఐసి రోడ్డు లోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నెలవారీ సమావేశం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కేన్సర్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి కేన్సర్‌పై అవగాహన కల్పించారు. డాక్టర్ పి మస్తాన్ సాహెబ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఏడాదికి రెండు లక్షల మంది కేన్సర్ వ్యాధికి గురి అవుతున్నట్లు తెలిపారు. వ్యాధి మొదటి దశలో గుర్తిస్తే చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయడం, జీవిత ప్రమాణాలు కూడా యథాతతంగా వుంటాయని పేర్కొన్నారు. మెడికల్ క్యాంపులో డాక్టర్ వి వెంకయ్య బాబు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వి రెడ్డి కుమారి, స్టాఫ్ నర్స్ పి మేహతాజ్ , సిబ్బంది రమేష్ బాబు , మహీంద్రా పాల్గొన్నారు. తొలుత నెలవారీ సమావేశం సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి సి వెంకటేశం శెట్టి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికేట్ లు ఈ నెలాఖరకల్లా ఖజానా అధికారులకు సమర్పించా లన్నారు. జూన్ జూలై మాసాల్లో ఇన్‌కమ్ టాక్స్ ఈ ఫైలింగ్ చేయాలన్నారు. సంఘ అధ్యక్షులు కెఆర్.శంకర్, రమణ, సిద్ధయ్య, జయరామ్ , మేహరున్నీబీ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో ఆర్‌కే విద్యార్థుల ఎంపిక



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక ఆర్‌కె డిగ్రీ కళాశాల్లో బహుళ జాతీయ కంపెనీ స్మార్ట్ ఇడి ఇన్నోవేషన్స్ బెంగుళూరు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 16 మంది డిగ్రీ విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల కరెస్పాండెంట్ డికె బద్రినారాయణ తెలిపారు. స్మార్ ఇడి కంపెనీ హెచ్‌ఆర్‌లు హేమంత్, జితిన్ సైనెక్స్ ఎడ్‌గ్రూప్ ప్రతినిధులు సుస్మిత, జ్యోతి ప్రసాద్‌లు గత రెండు రోజుల పాటు కళాశాలలోని బిసిఏ, బికామ్, బిబిఎ తృతీయ సంవత్సర విద్యార్థులకు ఎంపిక పరీక్షలు నిర్వహిచారు. అందులో 50మంది విద్యార్థులు పాల్గొనగా 16 మంది ఎంపికయ్యారని ఎంపికైన వారికి ఏడాదికి రూ.4 నుంచి 6లక్షల వరకు వేతనం 3నెలల శిక్షణ తర్వాత ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డికె బద్రినారాయణ, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు అభినందించారు.

పదకొండు దాటితే పని పడతాం: డిఎస్‌పి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి




శ్రీకాళహస్తి పట్టణంలో రాత్రి పదకొండు గంటలు దాటి దుకాణాలు నిర్వహించినా, సరైన కారణం లేకుండా వీధుల్లో సంచరించినా చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి హెచ్చరించారు. ప్రజా భద్రత దృష్ట్యా సదరు నిర్ణయాన్ని కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం డీఎస్పీ మీడియా సమావేశం నిర్వహించారు. ప్రజా భద్రత, నేరాల అదుపు దృష్ట్యా పట్టణంలో రాత్రి పదకొండుపైన ఎవరూ దుకాణాలు నిర్వహించొద్దని సూచించారు. సరైన కారణాలు లేకుండా బయట సంచరించకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను తమ ఇళ్లు, దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ భాగస్వామ్యంతో పట్టణంలో పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శాంతి భద్రత లను కాపాడడంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వన్ టౌన్ సీఐగోపి, టూ టౌన్ సీఐ వెంకటేశులు పాల్గొన్నారు.

పెండింగ్ బిపిఎస్ ఎల్‌ఆర్‌ఎస్‌కి దరఖాస్తు చేసుకోండి: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో పెండింగ్‌లో ఉన్న బిపిఎస్, ఎల్‌ఆర్‌ఎస్‌కి దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఎన్ మౌర్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 వ సంవత్సరంలో దరఖాస్తు సమర్పించి ఇప్పటికీ క్రమబద్ధీకరణ కాకుండా పెండింగ్‌లో ఉన్న అర్జీదారులకు మార్చి 31 వ తేదీవరకు మరో అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. 2020వ సంవత్సరంలో ప్రభుత్వం జారీచేసిన లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం-2020లో అనుమతిలేని లేఔట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవడానికి మరో అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. భవనాలు క్రమబద్ధీకరించుకోవడం వల్ల ప్రత్యేకంగా ఆక్యుపె న్సీ సర్టిఫికెట్ పొందవలసిన అవసరం లేదని, భవిష్యత్తులో భవన నిర్మాణ ఫీజులో మినహాయింపు ఉంటుందని, ఆస్తిపన్నుపై ఎలాంటి పెనాల్టీ ఉండదని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ ను 2007 తరువాత తిరిగి అమలులోకి తెచ్చారన్నారు. లేఔట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవడం వల్ల14 శాతం ఓపెన్ స్పేస్ ఛార్జీలు మినహాయింపు ఉంటుందని, పీనల్ ఛార్జీల నుండి మినహాయింపు ఉంటుందని, రోడ్డు, యాజమాన్య హక్కులు ధృవీకరిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని కమిషనర్ తెలిపారు.

వెటర్నరీ వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి..

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు వినతి



ప్రజాశక్తి - క్యాంపస్ : ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయూష్ వైద్య విద్యార్థులకు అందిస్తున్న విధంగానే తమకూ స్టయిఫండ్ ఇచ్చేలా కృషి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితను ఏపీ వెటర్నరీ స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. శనివారం బీసీ సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులపై సమీక్షించడానికి వచ్చిన మంత్రి సవితను నగరంలోని పద్మావతి గెస్ట్ హౌస్ లో వెటర్నరీ వైద్య విద్యార్థులు కలిసి వినతిపత్రం అందించారు. ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయూష్ వైద్య విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున స్టయిఫండ్ పెంచి ఇస్తోందన్నారు. వారి మాదిరిగానే తమకూ స్టయిఫండ్ వచ్చేలా కృషి చేయాలని, ఈ విషయం సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాలని వారు మంత్రిని కోరారు. అనంతరం పలు సమస్యల పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధిలో తమ పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. దీనిపై మంత్రి సవిత స్పందిస్తూ, వెటర్నరీ వైద్య విద్యార్థుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏపీ వెటర్నరీ స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ప్రతినిధులు పి.నష్వర్ ఖాన్, కేవీ ధర్మతేజ, ఎం.గుణ కౌశిక్, లోకేశ్ సాయి, రమేశ్, జితేంద్రనాయుడు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

చెరువులో యువకుడు గల్లంతు



చెరువులో గాలింపుచర్యలు చేపట్టిన పోలీసులు



సెల్వరాజ్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: చెరువులో పడి ఓయువకుడు గల్లంతైన సంఘటన శుక్రవారం సాయంత్రం మండలంలోని గౌనుచెరువులో చోటు చేసుకున్నది. సిఐ శ్రీనివాస్ తెలిపిన సమాచారం మేరకు మొగిలి గ్రామంలో గల శ్రీని ఫుడ్స్‌లోని పోడ్రాన్‌లో పనిచేస్తున్న నలుగురు స్నేహితులు సెల్వరాజ్, గోపీనాథ్, ప్రశాంత్, శరవణ స్నానం చేసేందుకు చెరువులోకి దిగారు. ఇందులో తమిళనాడు రాష్ట్రం నామకల్ చెందిన వరదరాజుల కుమారుడు సెల్వరాజ్ (27) చెరువు లోపలికి వెళ్లి తిరిగి రాకపోవడంతో తనతోటి స్నేహితులు పోడ్రాన్ మేనేజర్ గోపికి సమాచారం అందించారు. వారు స్థానికులతో వెతికి తర్వాత గజ ఈతగాళ్లతో అగ్నిమాపక సిబ్బంది ద్వారా చెరువులో అధునాత టెక్నాలజీని సెన్సార్లను ఉపయోగించి గాలించారు. శనివారం సాయంత్రం వరకు అతని మృతిదేహం గాని ఆచూకీ గాని కనబడలేదు. ఈ సమాచారాన్ని వారి కుటుంబ సభ్యులకు చేరవేయడంతో వారు చెరువు వద్ద కన్నీటిపర్యతమయ్యారు..

ద్విచక్రవాహనాలు ఢీ - వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- చౌడేపల్లి: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం చౌడేపల్లెలో చోటుచేసుకుంది. చౌడేపల్లి పరికిదొన ప్రధాన రహదారిలో తెల్లనీళ్లపల్లి సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయిజ ఈ ప్రమాదంలో ఆమిని గుంటకు చెందిన రాజేష్‌కు తీవ్రగాయాల పాల్వడంతో అతన్ని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో 13 మందికి గాయాలు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల నీవానది సమీపంలో శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారాన్ని అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అగరమంగళం హరిజనవాడ నుండి యాదమరిలో ఓ పెళ్లికి వెళ్తుతున్న ఆటోను లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుస్తక ప్రదర్శన పై దాడి

- మతోన్మాదులను అరెస్టు చేయాలి..
- సిపిఎం, సిపిఐ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్, తిరుపతి సిటీ: తిరుపతి నగరంలోని ఇస్కాన్ పక్కనే వున్న టిటిడి గ్రౌండ్‌లో భారతీయ విద్యా భవన్ ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనపై మతోన్మాద గూండాలు శనివారం 8 గంటల ప్రాంతంలో పుస్తకాలయాలపై దౌర్జన్యానికి, దాడికి పాల్పడ్డారు. ఈ దౌర్జన్యాన్ని ఆపాలని కోరిన సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజుపై దురుసుగా ప్రవర్తిస్తూ అసభ్య పదజాలంతో దూషించారు. విశాలాంధ్ర పుస్తకాలయం వద్దకు వచ్చిన మతోన్మాద గూండాలు కిరణ్‌కుమార్, తుమ్మ ఓంకార్‌లు 'పెరియార్ జీవిత చరిత్ర పుస్తకాలు తొలగించండి..' అంటూ హుకుం జారీ చేశారు. ప్రశాంతంగా ప్రజలు పుస్తకాలయంలో సంతోషంగా పుస్తకాలు కొనుగోలు చేస్తున్న సందర్భంలో మతోన్మాద గూండాలు గుంపుగా చేరి పుస్తకాలపై అవాకుల చవాకుల పేలుతూ దౌర్జన్యానికి దిగారు. స్థానికులు, కవులు, రచయితలు, మేధావులపై దురుసుగా ప్రవర్తించి దాడికి పూను కున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళిలు మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రశాంత వాతా వరణాన్ని కలుషితం చేస్తూ హిందూమత సామరస్యానికి కళంకం తెచ్చారని, ఇలాంటి వారికి కొందరు భయపడి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రచన స్వేచ్ఛను, భావాల స్వేచ్ఛను స్వాతంత్ర్యం నాటి భావాలను తుద ముట్టించడానికి ఇలాంటి రౌడీ మూకలు పూనుకుంటున్నాయని, దీనికి వ్యతిరేకంగా తిరుపతి ప్రశాంతతను కాపాడేందుకు ప్రజలందరూ సిద్ధం కావాలని వామపక్షాల తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే ప్రజలే వీరికి తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. పోలీసులు వెంటనే వారిని అరెస్టుచేసి తగిన చర్యలు తీసుకుని వీరి ఆగడాలు అరికట్టాలని కోరారు.

26 ఎర్ర చందనం దుంగలు స్వాధీనం



ఫారెస్టు అధికారుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధిలోని రేణిగుంట - కడప హైవే సమీపంలోని రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో భూమిలో డంపు చేసిన ఎర్రచందనం దుంగ లను రహస్యంగా తవ్వి తీసి మరో ప్రాంతానికి తరలి స్తుండ గా ముగ్గురు నిందితులను అరెస్టుచేసి 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసు కున్నామని తిరుపతి రేంజి అటవీ క్షేత్రాధికారి బి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ ఆదేశాలతో శుక్రవారం రాత్రి అందిన రహస్య సమాచారం మేరకు అప్రమత్తమై సిబ్బందితో కలిసి కరకంబాడి వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. రాత్రి పది గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలలో అక్కడికి వచ్చిన నలుగురు వ్యక్తులు దాచి ఉంచిన ఎర్రచందనం దుంగలను బయటకు తీస్తుండగా వారిని చుట్టుముట్టి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో రఘు అనే వ్యక్తి పారిపోయాడని అతని కోసం గాలిస్తున్నామని తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిన ఎర్రచందనం దుంగల విలువ 25 లక్షల రూపాయలు ఉంటుందని అటవీశాఖ అధికారు లు పేర్కొన్నారు. తిమ్మ నాయుడుపాలెం సెక్షన్ ఎఫ్ఎస్ఓ రమేష్ బాబు, ఎఫ్‌బిఓ వెంకటేశ్వరరావు, కిషోర్ కుమార్, సురేష్ బాబు, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.